# మనోలోకనం

వసుమతి మేడమీద గదిలో కూర్చుని కిటికీలోనుంచి చూస్తూ ఉంది. తెల్లవారు జామున మొదలయింది తుఫాను గాలి. ఉరుములు, మెరుపులు, స్థిరంగా వానపడు తోంది–రెండు గంటలనుంచి, రోజంతా ఇలాగే ఉంటుందేమో తెలియదు. కాస్తంత వాన చినుకులు పడితేనే రోడ్డంతా బురద బురదగా తయారవుతుంది. ఈ వాతావరణానికి ఎక్కడ ఏం జరుగుతుందో ఊహించడం కష్టం.

ఆమె పుస్తకాలు రాస్తూ ఉండేది. పది సంవత్సరాల క్రిందటి వరకు. అవి ఈ రోజుకూ బహుళ ప్రచారంలో ఉన్నమాటా వాస్తవమే. కాని ఆ వ్యాసంగం ఎక్కువ తృప్తినీ, ఊరటనూ ఇవ్వలేదు. ఇతరుల జీవితాలను అర్థం చేసుకోకుండానే, పూర్తిగా అవగాహన దొరకకుండానే తానే అన్నీ శాసిస్తున్నట్లు పుస్తకాలు రాసిపడవేయడం ఏమంత మంచిపని! ఇప్పుడు పుస్తకాలు రాయడం మానివేసినా–వెనకటి 'రాయల్టీ'లు విరివిగా వస్తూనే ఉన్నాయి.

'నేను మిగిల్చిన డబ్బుకంటే నాకు పుస్తకాల మీదనే ఎక్కువ డబ్బు వస్తుంది. నీ జీవితానికి ఏమీ డోకాలేదు. నాకు అదే తృప్తి' అన్నాడు భర్త చివరి మాటలుగా.

అంతిమస్మరణ భగవంతుడిని గురించి కాకుండా కుటుంబ విషయాలను గురించి కావడం నిజానికి ఆయనకు ఇష్టం ఉండదు అని ఆమె ఎరుగును. పైకి వచ్చినవి ఈ మాటలు. లోపల– అతని మనసులో ఎన్ని గుణకారాలు జరుగుతూ ఉండినాయో ఎవరు ఎరుగుదురు?

అతను నడివయస్సు నుంచి లోతుగా ఆలోచించడం చేతనయిన మనిషి. కంటికి కనిపించని విషయాలను గురించి కూడా ఆవేశంగా మాట్లాడడం అలవాటు

చేసుకున్నాడు. ఇంకా ఏమేమో తెలుసుకోవాలని అతనిలో తృష్ణ ఉంది. అది అనుక్షణమూ పెరుగుతూ ఉండేది.

కొడుకులు ఇద్దరూ తమ తమ ఉద్యోగాల మీద ఊళ్లు ఏలుతూ ఉంటే వసుమతికి వంటరితనం బాగా అలవాటు అయిపోయింది. నీడ ఉండీ తోడులేని జీవితం అయిపోయింది.

ఊరు చుట్టూ ఉన్న పొలాలతో, పొలాలలో ప్రవహించే నీళ్లకాలవలతో నేలను చీల్చుకు వచ్చే మొక్కల నాళికలతో, మొక్కల చివరలను అల్లల్లాడించే పిల్లగాలులతో, సూర్యుడి ఎండతో తడిసి కొత్తరంగులు పులుముకునే వాతావరణంతో- అప్పుడప్పుడు తలలు ఆడిస్తూ తిరిగే కోడెత్రాచుల విన్యాసంతో, ఎలాంటి పరిధులు లేకుండా పర్యావరణాన్ని తనలో ఇముడ్చుకుందామని ప్రయత్నంచేసే మనసుతో- సమైక్యం అవుతూ జీవితాన్ని అలవోకగా గడపడం ఎంత నిర్వికారంగా ఉంటుందో ఇప్పుడిప్పుడే తెలిసివస్తోంది వసుమతికి.

వసుమతి ముందుగా ఒక ఆశ్రమానికి వెళ్ళింది. అక్కడో గురువుగారు ఉన్నారు. చూడటానికి అమాయకంగా ఉంటారు. వయసు ముదిరిన వాడు. యోగానుభవాలను గురించి శిష్యులతో సంస్కృత శ్లోకాలు వల్లిస్తూ మాట్లాడుతాడు. ఆ శ్లోకాలు అందరూ అర్థం అయినట్లు తలలు ఊపుతూ ఉండేవాళ్ళు. ఆరు నెలలు తిరగకుండానే ఏదో 'వెలితి' అనిపించింది వసుమతికి, వెళ్ళిన మొదట్లో బాగానే ఉన్నట్లు తోచినా.

'ఈ గురువుగారు బహుజ్ఞాని, మీరు ఆశ్రమం విడిచి వెళ్లిపోవాలని ఎందుకు అనుకుంటున్నారో అర్థం కాదు. ఆలోచించండి' అన్నారు కొందరు ఆశ్రమ వాసులు.

'ఇక్కడ మీకు ఏమన్నా కష్టం కలిగించామా మేం? మా మీద ఎందుకంత అలుక?' అన్నట్లుగా మాట్లాడారు మరికొందరు.

ఎందుకు వచ్చిందో స్పష్టంగా తెలిస్తే గదా - ఇక్కడ నుంచి ఎందుకు వెళ్ళిపోతున్నదో ఇతరులకు వివరంగా చెప్పగలిగేది! వసుమతి ఏమీ సమాధానం చెప్పలేదు.

గురువుగారు ప్రత్యక్షంగా ఏమీ అడగలేదు.

'ఉండాలనుకుంటే ఉండండి, మీ ఇష్టం' అన్నారు ఆమె వచ్చినప్పుడు. వెడతానన్నప్పుడు కూడా మీ ఇష్టం అన్నారు అంతే!

మరో ఆశ్రమానికి వెళ్లింది.

అక్కడ నియమాలు, శిక్షణ ఎక్కువ. అయినా ఆమె పట్టించుకోలేదు.

అక్కడ పూజలు, పునస్కారాలు జరిగేవి.

సంకీర్తనలు, ప్రార్థన సమావేశాలు జరిగేవి.

ఆశ్రమ వాసులకు స్వేచ్ఛ లేదు. ఎప్పుడు ఏం చేయాలో అన్నీ ముందుగానే నిర్ణయం అయి వుంటాయి.

స్వేచ్ఛ కావాలనుకున్న వాళ్లకు ఆశ్రమవాసం మటుకు ఎందుకు?

వసుమతికి ఇక్కడ కూడా మనశ్శాంతి దొరకలేదు. అది ఎక్కడ దొరుకుతుందో?

గతం మనసును పూర్తిగా ఆక్రమించుకుంది.

ఈ బాధ అంతా గతాన్ని గురించే, వర్తమానం గురించి కానేకాదు.

ఆకాశం నుంచి నీళ్ళ ధారలు కురవటానికి ఎవరి అనుమతి కావాలి? ఎవరి అంగీకారం కోసం అర్జీలు పెట్టుకోవాలి? – వసుమతికి నవ్వు వచ్చింది, ఈ ఆలోచనకు.

మరుక్షణమే – ఆశ్రమ వాసం కోసం భర్త తనను అడిగిన రోజులు గుర్తుకు వచ్చాయి. రిటైర్ అవడానికి ఆరు నెలలు ముందుగానే ప్రారంభించాడు అతను, ఆ ఆలోచన.

'ఇన్నాళ్ళూ ఏదో యాంత్రికంగా గడిచిపోయాయి రోజులు. ఉదర నిమిత్తం "బహుకృతవేషం" వేశాను. అట్లాగని ఎవరికి అన్యాయం చేశానని, అక్రమంగా డబ్బు సంపాదించాననీ కాదు. "నేను" ఏమిటో తెలుసుకోవాలి. అదీ నా తక్షణ కర్తవ్యం. జీవిత పరమార్థం కోసం వెదుకుతూ సన్యాసం తీసుకోవడం మంచిమార్గం అంటూ ప్రారంభించాడు మాట్లాడడం.

'సన్యాసం పుచ్చుకుంటారా?' అన్నది వసుమతి మొట్టమొదటగా ఆ మాట భర్త నోటి నుంచి విన్నప్పుడు నిర్ఘాంతపోయి.

ఆయన, అవును, అలాగనే అనుకుంటున్నాను. నీవు అనుమతి ఇస్తే' అన్నాడు.

'సన్యాసం పుచ్చుకోవటానికి మీకు ఏం తక్కువయిందని?'

తక్కువ అయినవాళ్లే సన్యాసులలో కలిసి పోతారనీ, సంసార తాపత్రయం నుంచి తప్పించుకోవటానికే–దరిద్రంనుంచి బయటపడటానికి ఇదే మంచిమార్గం అనీ– చాలామంది అనుకుంటారని వసుమతి తనకు తాను చెప్పుకుంది.

'చక్కగా పెన్షన్ వస్తుంది. నిల్వ ఆస్తుల మీద ఆదాయం తక్కువలేదు. నన్ను ఏం చేసి పోదామని మీ ఉద్దేశ్యం?' బేలగా అడిగింది.

'ఒక మనిషి మరో మనిషిని ఏమీ చేయలేదు, వసుమతీ. ఈ సంబంధాలన్నీ రుణానుబంధ రూపాలు. వీటిని గడిచి గట్టెక్కించడం అవసరం ఎప్పటికయినా' అన్నాడు.

'నేనంటే ఎందుకంత అయిష్టం ఏర్పడుతోంది, అకస్మాత్తుగా?'

'నువ్వంటే అయిష్టతా? ఎవరన్నారు?'

'కాకపోతే-ఇన్ని ఏళ్ళ కాపురం తరువాత, పిల్లలు పెద్దవాళ్ళయి ఎవరిదారి వాళ్ళు చూచుకున్నట్లే మీరు నన్ను నాపాటికి వదిలేసి వంటరిని చేసి వెళ్లిపోవాలని ఎందుకు అనుకుంటున్నారు?- ఉద్యోగానికి రిటైర్‌మెంట్‌గాని సంసారానికి కాదుగా?'

ఆయన అర్థం అయ్యేట్లు చెప్పడానికి ప్రయత్నించాడు.

'తాపీగా విను. ఆవేశం, ఉద్వేగం తెచ్చుకోకు. వినరాని మాటలు వింటున్నట్లు భయపడకు. జీవితంలోని దశలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు-

'ఎన్నయినా చెప్పండి. మీరు దూరం అయిపోవడం నేను సహించలేను. నా వల్ల కాదు. నాకు అన్యాయం చేయకండి' అని మొండిగా అంది.

'నీకు అన్యాయం చేయడం ఒక్కనాటికీ నా వల్ల కాదు. అందుకనేగా నీ అనుమతి అడుగుతున్నాను! అనుమతి ఇస్తావా సరేసరి. ఇవ్వకపోతే ఇంట్లోనే ఉండిపోతాను. నిన్ను నొప్పించి నేను బాముకునేది ఏమీ ఉండదు. కాకపోతే పరిస్థితిని నా దృష్టినుంచి కూడా ఆలోచించమని అడుగుతున్నాను. అంతే' అన్నాడు.

ఎంత ఆలోచించినా భర్త సన్యాస ఆశ్రమం స్వీకరించటానికి అవసరం కనిపించలేదు వసుమతికి. అసలు ఎందుకు ఈ అనాసక్తత?

'సన్యాసం పుచ్చుకుని మీరు ఏంచేస్తారు? చెప్పండి. కొత్తగా ఆశ్రమం స్థాపిస్తారా? యజ్ఞాలు, క్రతువులు చేయిస్తారా? విపరీతమైన ఆస్తిపాస్తులు సంపాదించి కోర్టు వ్యవహారాలలో తలమున్కలై తిరుగుతూ ఉంటారా?' అని అడిగింది.

'నువ్వు అనుకుంటున్న పనులు ఒక్కనాటికీ చేయను'

'మరి ఏం చేస్తారుట?' భర్త మాట్లాడుతున్నది, వేళాకోళం అనుకోవటానికి వీల్లేదు గాని టొత్తిగా మనసుకు పట్టకుండా పోతోంది.

'ఏమీ చేయను. ఇన్నాళ్ళూ పనిచేసి చేసి అలసిపోయాను'

'అందుకేగా రిటైర్‌మెంట్ ఇస్తున్నది!!

'అవును. దాన్ని పూర్తిగా ఉపయోగించుకుందామని నా ఉద్దేశ్యం'.

'నాకు అర్థం అయ్యేట్లు చెప్పలేరా?' అనడిగింది.

అతని అంతరంగం తెలుసుకోవడం అసాధ్యం అవుతోంది.

'చెబుతా విను. హాయిగా నా గదిలో కూర్చుని ఉండిపోతాను. నాకు వచ్చిన వేదాంత తత్త్వదర్శన పుస్తకాలు పోగుచేసుకుంటాను. విశ్రాంతిగా చదువుకుంటాను. ఆలోచించడం ఎలాగో నేర్చుకుంటాను. ఎవరితోనూ మాట్లాడను. సమయం వృధా చేయకుండా సత్ చింతనలో గడిపేస్తాను. ఆత్మవికాసం కోసం నా పద్ధతులు నేను అన్వేషిస్తాను'

'ఇంతేనా? ఇంకేమీ చేయరా?' అనడిగింది నమ్మకం చాలనట్లు.

'లోక వ్యవహారాలు పూర్తిగా మానివేస్తాను. బజారుకు వెళ్లడం, వస్తువులు కొనడం, డబ్బు బేరాలు చేయడం, స్నేహితులతో సరదాగా గడపడం... ఇవన్నీ మానివేస్తాను...'

'నిజంగా... ఇన్నాళ్ళు అలవాటు తరువాత ఈ పనులన్నీ చేయగలరా?' అనడిగింది. వసుమతి ఇంకా నమ్మలేనట్లు.

"ప్రయత్నం చేస్తాను. నేర్చుకుంటాను. నాకు నేనుగా ఏర్పరుచుకున్న 'నియమావళి' ఉంది. ఎవరి సలహాలు, సంప్రదింపులు, బలవంతాలు లేవు".

'మరి భోజనం ఎలా వస్తుంది? ఆరోగ్యం ఎక్కువ తక్కువలు ఎవరు చూస్తారు?' అయోమయంగా అడిగింది వసుమతి.

'అందుకే ఆశ్రమంలో చేరుతానంటున్నాను'

'ఏ ఆశ్రమమో నిర్ణయం చేసేసుకున్నారా?'

'నిన్ను అడిగి నీవు అంగీకరించాక ఏదో ఒకటి ఫిక్స్ అప్ చేస్తాను!' వసుమతి అతని నోటి వెంటనే విన్నది. ముందు కొంత విరాళం ఇచ్చేసి తరువాత ప్రతినెలా కొంత ఫీజు ఇస్తూ ఉంటే హోటళ్ళలాగా బోజనం, వసతి ఏర్పాటుచేసే ఆశ్రమాలు ఉన్నాయనీ, అక్కడ ఎవరికివారు తమకు ఇష్టమైన పద్ధతిలో కాలం గడపవచ్చుననీ.

'మరి... మరి... నేను... నేను.. ఏమయిపోవాలట?'

'ఏమీ అయిపోనక్కర్లేదు. నీ పుస్తక రచన వ్యాసంగం నీకు ఉంది. విసుగుపుడితే, ఇతరుల అండదండలు కావాలనుకుంటే అబ్బాయిల దగ్గరకు వెళ్ళి ఉంటావు' అన్నాడు ఐహెచ్ నింపాదిగా.

'నేను అబ్బాయిల దగ్గరకు వెళ్లను' ఎంతో ధీమాగా అంది వసుమతి, అతను ఇలాంటి నిర్ణయాలన్నీ ఎందుకు యోచించి పెట్టుకున్నాడో సుతరామూ అర్థం కాక.

'నేను కనిపించడం పనికిరాదా? ఆ ఆశ్రమంలో ఇంకా ఇతర జనం ఉండరా? అక్కడి బరువు బాధ్యతలు నెత్తిన పడితే...?'

'నీవు కనిపించగూడదనీ నీతో తెగతెంపులు చేసుకోవాలనీ నేను ఈ పని చేయడం లేదు వసుమతీ!' ఆశ్రమంలో కొత్తగా బరువులు బాధ్యతలు మీద పడతాయేమో అతనికీ తెలియదు.

వసుమతి ఎక్కువ సేపు ఆలోచించనవసరం లేకుండానే చెప్పేసింది. మీరు చేయాలనుకుంటున్న పనులకు, వద్దనుకుంటున్న వాటికి, ఎక్కడికో ఆశ్రమానికి వెళ్ళవలసిన అవసరం లేదు. సన్యాసాశ్రమం తీసుకుంటేనే తప్ప ఇల్లు వదలి పోతేనే తప్ప "నియమావళి" సాగదు అనుకుందుకు వీల్లేదు. మీరు ఇంట్లోనే ఉండిపోయి మీ ఇష్టం వచ్చినట్లే కాలం గడపండి. మీరు భోజన వసతుల కోసం డబ్బు డిపాజిట్లు, నెలసరి ఫీజులు ఇవ్వనక్కర్లేదు. మీ అభీష్టానికి ఏమీ భంగం కలుగకుండా "ప్లాన్" చేసుకున్నట్లుగా రోజులు గడిచిపోయేట్లు చూచే పూచీ నాదీ.

'అయితే అనుమతి ఇవ్వనంటావా?'

'ఇంట్లో ఉండడం మీ ప్రణాళికకు ఆటంకం అనిపించిన ఉత్తరక్షణం, నేను ఏమీ అభ్యంతరం చెప్పను. సరేనా?' అంది వసుమతి.

–అలా ఆరు సంవత్సరాలు గడిచిపోయాయి.

మళ్లీ ఆ ప్రస్తావన తీసుకువచ్చే అవకాశం రాకుండానే వసుమతి ఇంటి వ్యవహారాలన్నీ తానై చూసుకుంది.

"మంచి వాళ్లను నిలుపుకోవడం" ఎలాగో ఆమెకు తెలిసినట్లుగా ఇంకెవరికీ తెలియదని నిరూపించుకుంది.

ఆరోగ్యంలో ఏమీ లోపంలేదు. వ్యాయామం చక్కగా సాగుతోంది. ఉన్నట్లుండి ఒకనాడు రాత్రి నిద్రలోనే ఆయన కన్ను మూశారు.

'సునాయాస మరణం! ఎంత అదృష్టవంతుడు' అని తెలిసిన వాళ్లూ తెలియనివాళ్లూ తెగ అబ్బురపడిపోయినారు.

ఈ ఆరేళ్ళలోనూ జీవితంలో మార్పులు, ఒడుదుడుకులు ఏర్పడలేదు. రచనలకు ఎక్కువ సమయం ఇస్తూ కాలం గడుపుదామనిపించింది. అదీ అంత మానసిక ఉల్లాసం కలిగించకపోవడంతో మానేసి రికామిగా ఉండిపోయింది. ఎటొచ్చీ ఆయన పోయిన సంవత్సరానికి తనకూ జీవితం అంటే ఏమిటో రకరకాల ప్రశ్నలు... జవాబు దొరకని సందర్భాలు మనసును వేధించసాగాయి.

జీవిత చరమాంకంలో ఇలాంటి సందర్భాలు తప్పనిసరా? ఏమి వెతకడం కోసం ఆయన ఏకాంతంకోరుకున్నారో, ఆ వెదుకులాట తాను కొనసాగించాలా?

వసుమతికి ఈ జీవిత శకలం గూడా తమాషాగానే అనిపించింది. ఆశ్రమాలలో అన్వేషణ చేసినప్పుడు.

లాంఛనంగా, కొడుకులు తమ దగ్గరకు రమ్మనీ మరింత విశ్రాంతిగా విలాసంగా జీవితం గడపమనీ కోరారు, పోరారు.

వసుమతి చిన్నప్పటి నిర్ణయంనుంచి వేరుగా పోవటానికి ఒప్పుకోలేదు. ఆయన తన మాట విని ఇల్లు వదలకుండా ఉండిపోయారు. తాను మాత్రం ఈ ఇంటిని వదలి, అక్కడా ఇక్కడా వెదకవలసిన పని ఏమిటి? ఆశ్రమాలకంటే గుడి కంటే ఇల్లే పదిలం అని... తాను ఎందుకు మరచిపోయి ఆశ్రమాల వేటలో పడిపోయిందో వసుమతికి అర్థం కాలేదు.

ప్రయత్నపూర్వకంగా దొరికిన ప్రశాంతి కలకాలం నిలవదా? బాదరబందీలు సంఘర్షణలు లేకపోయినా మనస్సు ఎందుకు అటు ఇటు కదలాడుతుంది? మనస్సును మరచిపోయేంత ఏకాంతం ఎందుకు సాధ్యం కాదు?

ప్రయత్నం లేకుండానే ప్రశాంతి దొరుకుతుంది.

వసుమతికి ఈ తుఫాను గాలీ ఇలాగే ఉండిపోయినా తనకేమీ బెంగ, భయం, ఆలోచన, అవసరంలేదు... అనిపించింది.

ఆకాశం నుంచి పడుతున్న వర్షధారలు ఆమె మనసును పూర్తిగా తడిపి శుభ్రంగా కడిగి మరో కొత్త వస్తువుగా తయారు చేశాయి.

ఆమె జీవితంలో ఇదివరకు ఎన్నడూ ఎరగని పరిపూర్ణత సంతరించుకుంది.

◆